

''ఆ పాదుక నాదేనమ్మా!'' అని ఆమెకు అర్థమయ్యేలా చెప్పుకొన్నాడు పుత్రకుడు.

''సరే.. ఎల్లుండి అమ్మాయికి స్నానం చేయిస్తాం. ఆ తర్వాత వచ్చి పట్టుకు పో!'' అన్నది ముసలమ్మ.

ఆ లోపుగా మిగిలిన వాటికోసం వెతుకుతూ ఆ పల్లెలోనే కాలక్షేపం చేశాడు పుత్రకుడు. కానీ లాభం లేకపోయింది. అనుకున్నట్లే మూడోరోజున ముసలమ్మ ఆ పాదుకను పుత్రకునికి ఇచ్చేసింది.

అతను దాన్ని చేతబట్టుకుని..

''ఓ పాదుకా రాజమా! నీ మహత్వం వల్లనే నేను నిన్ను మళ్లీ చేజిక్కించుకోగలిగాను. దయచేసి నీ రెండో జత పాదుక వద్దకు నన్ను తీసుకుపోవా?'' అని కోరుకున్నాడు.

వెంటనే ఎవరో చేయిపుచ్చుకుని లాక్కుపోతున్నట్లు ఒక వీధివెంట కొంతదూరం వెళ్లాడు. ఒక ఇంటి బయట ఆగిపోయాడు. లోపలి వారిని పిలిచి..

''అయ్యా! ఈ పాదుకకు జోడీ మీ ఇంటిలో ఉంది. ఇవి మా గురువుగారివి. వీటిని నేను రోజూ పూజించుకుంటాను. దయచేసి నా పాదుక నాకు ఇప్పిస్తారా?'' అని కోరాడు.

ఆ మాటలు విన్న ఆ ఇంటి ఇల్లాలు..

''ఇది మా ఇంట్లో ఉన్నదని చెప్పిందెవరు?! ఈ ఊళ్లో మేమంటే కళ్లల్లో నిప్పులు పోసుకునేవాళ్లు ఎక్కువైపోయారు'' అని విసుక్కుంటూనే ఆ పాదుకను తెచ్చి పుత్రకుని చేతిలో పెట్టింది.

గూడెం నుంచి బయటికొచ్చిన పుత్రకుడు ఆ పాదుకలను తొడుక్కున్నాడు.

'దండం ఉన్నచోటికి వెళ్లాలి' అని మనసులో కోరుకున్నాడు.

మరునిమిషంలో ఓ పసులకాపరి అయిన కుర్రవాడి ముందున్నాడు. వాడి చేతిలో దండం ఉంది.

''ఒరేయ్ అబ్బాయ్! ఆ దండం ఏమిటీ?! ఇలా పట్టుకురా చూద్దాం!'' అని దగ్గరికి పిలిచాడు.

వాన్ని మాటల్లో పెట్టి, ఆ దండాన్ని సంగ్రహించాడు.

'కాలం చక్కబడినప్పుడు అన్నీ వాటికవే సమకూరుతాయి. నీరు పల్లానికి చేరుకున్నట్లు మనం కోరుకోకపోయినా మంచికాలంలో సంపదలు చేకూరుతాయి. చెడు కాలంలో చెట్టుమీద పిట్టల్లా సంపదలు ఎగిరిపోతుంటాయి' అనుకున్నాడు.

''ఓ పాదుకలారా! నన్ను నా బొంతసంచి ఎక్కడుందో అక్కడికి తీసుకుపోండి'' అని కోరుకున్నాడు.

కళ్లు మూసుకుని తెరిచేలోపుగా అతనొక నాలుగుబాటల కూడలిలో ఉన్నాడు. అతనికి ఎదురుగా పెద్ద మర్రిచెట్టుంది. దాని శాఖలు నాలుగు దిశలకూ క్రోసెడు దూరానికి వ్యాపించి ఉన్నాయి. దానికింద కొంతమంది బిచ్చగాళ్లు కాపురం ఉన్నారు. ఒకచోట పుత్రకుని తాలూకు బొంతసంచిలో ముష్టిగింజలు మూటకట్టి ఉన్నాయి.

ఆ బిచ్చగాళ్లలో ముగ్గురు మగవాళ్లున్నారు. పుత్రకుడు వారితో మాటలు కలిపాడు.

''మీదే ఊరు? ఎక్కణ్నుంచి వచ్చారు?! ఎక్కడికి పోతున్నారు?!'' అని ప్రశ్నలు వేశాడు.

మాటల్లో ఆ ముగ్గురిలోనూ వయసులో పెద్దవాడిపేరు రామజోగి అని.. అతనో తంత్రగాడని తెలిసింది. మిగిలిన ఇద్దరూ అతని తంత్రశక్తిని గురించి గొప్పగా చెప్పారు.

''అయితే రామజోగి అంతవాడా?!'' అని ఆశ్చర్యం వ్యక్తంచేశాడు పుత్రకుడు.

''అవును బాబూ! నేను ఢక్కా మోగిస్తూ.. 'అంబ పలుకు జగదంబ పలుకు' అంటూ వీధివెంట పోతుంటే భూతాలు పారిపోతాయని జనాలు విశ్వసిస్తారు. ఇతరులమీద కసి, కోపం ఉన్నవాళ్లు.. డబ్బు గట్రా కావాల్సిన వాళ్లు నా జోలెలో బియ్యంపోసి సాయం కోరుతుంటారు. ఈ విద్య పుణ్యమా అని ఇప్పుడో పెద్ద సమస్య వచ్చిపడింది'' అని రామజోగి విచారంగా చెప్పాడు.

''ఏం జరిగింది?''.. ఆసక్తిగా అడిగాడు పుత్రకుడు.

అప్పుడు రామజోగి తన కథను చెప్పడం మొదలుపెట్టాడు.

''ఇక్కడికి పక్కనే ఉన్న ఊరిలో ఒక సోమిదమ్మ ఉంది. ఆమె కోడళ్ల పాలిట కొరివిదయ్యం. నలుగురు మగపిల్లల్లో.. చివరి ముగ్గురికీ పెళ్లిళ్లు కాలేదు కానీ, పెద్దవాడికే నాలుగుసార్లు పెళ్లయింది. ఎంతమంది కోడళ్లు వచ్చినా.. ఈ అత్తకు వాళ్లతో పడేది కాదు. ఏదో కారణంతో కాపురంలో కలతలు లేవదీసి భార్యాభర్తల్ని విడదీసేది.

ఆమె దృష్టిలో కాపురానికి వచ్చేవరకే కోడలు. ఆ తరువాత పగదానికన్నా అధమం. మొదటిరోజు నుంచీ ఆ అత్తపెట్టే ఆరళ్లు భరించలేక కోడళ్లు పారిపోతుండేవారు. ఇటీవలే పెద్దకొడుక్కి మళ్లీ పెళ్లయి, నాలుగో కోడలు కాపురానికి వచ్చింది.

ఒకనాడు కూతురిని చూసుకోవడానికి వియ్యంకుడు ఇంటికి వచ్చాడు. జరుగుతున్న తతంగమంతా చూసి నొచ్చుకున్నాడు.

'నువ్వు కోడంగ్రమారివని తెలియక మీ ఇంటికి పిల్లనిచ్చాను. నువ్వు కూడా కూతురిని కన్నతల్లివే. నీ కూతురిని కూడా అత్తవారు ఇలాగే ఆరళ్లు పెడితే నీకెంత బాధ కలుగుతుంది?! ఆ మాత్రమైనా నా కూతురిపైన కనికరం ఉంచరాదా?' అని ఎంతో బతిమాలుకున్నాడు. చివరికి..

'ఒక్క పదిరోజులు ఆగి మళ్లీ వస్తాను. ఈలోపు నీ పద్ధతి మార్చుకోకపోతే నిన్నేం చేస్తానో చూడు' అని బెదిరించి వెళ్లిపోయాడు.

ఆనాటినుంచి కోడంగ్రమారి అత్త వింతనాటకం ఆడటం మొదలుపెట్టింది. వియ్యంకుడు తనపై ఏదో దయ్యాన్ని ప్రయోగించాడని.. రాత్రిళ్లు ఆ దయ్యం వచ్చి తన గొంతు పిసికేస్తున్నదని గొడవ చేయసాగింది.

తల్లి పడుతున్న బాధ చూడలేని కొడుకు.. ఒకనాడు నేను ఢక్కా మోగిస్తూ వాళ్ల వీధివెంట వెళుతుండగా చూసి నన్ను పిలిచాడు.

నేనా గయ్యాళి అత్తను చూసి..

'మీ ఇంటిలో కామినీ భూతమున్నది. నాకు కనిపిస్తున్నది. దాన్ని నేను మారణహోమం చేయగలను. కానీ నూటపదహార్లు ఖర్చవుతాయి. ఆ సొమ్మిస్తే ఇప్పుడే ప్రక్రియ మొదలుపెడతాను' అన్నాను.

కుమారుడు కొంతమొత్తం తెచ్చి నా చేతిలో పోశాడు. పని పూర్తయ్యాక మిగిలిన సొమ్ము ఇస్తానన్నాడు. నాలుగురోజులు పోయాక వెళ్లి రక్షరేకు ఇచ్చాను. కానీ గయ్యాళి కట్టుకోలేదు.

'నా వియ్యంకుడు చచ్చేవరకు నేనీ రేకులేవీ కట్టుకోను' అని శపథం పట్టింది.

నిజానికి ఆ వియ్యంకుడేమీ ప్రయోగం చేయలేదు. అయినా మనుషుల్ని మంత్రాలతో చంపడం నా శక్యమా?! ఆవిడ మాటలాగే నా మాట కూడా వట్టిదే. అయినా..

'నిత్యం హోమం చేస్తున్నాను. నేడో రేపో నీ వియ్యంకుడు చచ్చిపోతాడు!' అని మభ్యపెట్టి ఆమె దగ్గర్నుంచి పదోపరకో సంపాదిస్తున్నాను. ఇది తొందరగా పూర్తి చేయకపోతే ఊరివాళ్లు మమ్మల్ని తన్ని తరిమేసే అవకాశముంది. ఆ కోడంగ్రమారి దగ్గర్నుంచి మరికొంచెం సంపాదించుకుని ఇక్కణ్నుంచి పోవాలని చూస్తున్నాం''..

..రామజోగి చెప్పిన కథంతా విన్న పుత్రకునికి తన బొంత సంచీని.. అతని దగ్గర్నుంచి తిరిగి సంపాదించుకునే అవకాశం దొరికినట్లు అనిపించింది. చెట్టుకు వేలాడగట్టిన తన సంచీవైపు ఓసారి చూశాడు.

మరికొన్ని మంచిమాటలు చెప్పి, రామజోగిని బుట్టలో పడేయాలనుకున్నాడు.

''ఇటువంటి గంపగయ్యాళి కథ నాకొకటి తెలుసు. చెబుతాను వినండి'' అంటూ ఇలా మొదలుపెట్టాడు.

* * *

విన్నకోట అగ్రహారంలో సానుభూతి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను పుట్టు దరిద్రుడు కావడం వల్ల భిక్షాటనతో బతుకుతుండేవాడు. అతని భార్యవంటి గయ్యాళి మూడు లోకాల్లో లేదు. నువ్వు చెప్పిన కోడంగ్రమారి అత్తకంటే చాలా చెడ్డది. మగడు తెచ్చిన బియ్యం వండి తాను తిని, మిగిలిందే భర్తకు పెట్టేది. అతనా అన్నం తిని, పాత్రలు తోమి జాగ్రత్త పెడుతుండేవాడు.

ప్రతిరోజూ రాత్రిపూట ఒక వీసెడు గోగునార తెచ్చి గట్టి తాడు పేనేది. ఆ తాడుతో భర్తను కసిదీరా కొడుతుండేది. అలా కొట్టకపోతే ఆమె చెయ్యి తీట తీరేది కాదు.

ఒకనాడు అతనికి ఎవరో శుభలేఖ ఇచ్చి పొరుగూరికి పంపించారు. అతను తిరిగి రావడానికి పదిరోజుల సమయం పట్టింది. గంపగయ్యాళి నిత్యం భర్త కోసం కొత్త తాడుపేని సిద్ధం చేస్తూనే ఉంది. కానీ ఎవరిని కొట్టాలో తెలియక.. చేతుల తీట తీరక చాలా బాధపడసాగింది.

**(వచ్చేవారం.. పాటలీపుత్ర నగరం)**